క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలోని పెద్దచెప్పలి, పి.కొత్తపల్లె, ఈడిగపల్లె గ్రామాల్లో మూడవరోజు శనివారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె : మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సమావేశంను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండలంలో పనిచేసే అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : ప్రతిరోజు యోగా చేయడంవల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా ఉపాధ్యాయుడు రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బుద్ధయోగ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వచ్చేనెల జూన్ 3వ తేదీవరకు ఈ ఉచిత యోగ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమాలను విద్యార్థులు, మహిళలు, పురుషులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న వేణు కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని దివ్యాంగుల కార్యాలయంలో శుక్రవారం అంకాలమ్మ గూడూరుకు చెందిన ఆవుల వేణుగోపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర సరుకులతోపాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, వేణు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

వైవీయూ: కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. వీరసుదర్శన్‌రెడ్డి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా లేదా గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఏరియా రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (సేల్స్) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెజ్యూమ్‌తో కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 నేషనల్స్‌కు ఎంపిక

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. నగరంలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కార్తీక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ప్రియ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఎస్ఏ శిక్షకుడు పి. కల్యాణ్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు.

ఐటా జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

వైవీయూ: ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కడప నగరం బెల్లంమండివీధిలోని మద్రస జహారాలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐటా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. అబ్దుల్‌రజాక్, జాతీయ కార్యదర్శి ఎస్. షాకీర్‌హుస్సేన్ సమక్షంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. నజీర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అబ్బాస్‌అలీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా గౌస్‌మోహిద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.ఖాదర్, అహ్మద్‌అలీ, జాయింట్ సెక్రటరీలుగా ఫక్రుద్దీన్, జుబేర్, కోశాధికారిగా అబ్దుల్‌కలాంలను ఎన్నుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

వేముల : మండల వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డితో కలిసి ఆయన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో 500 ఇళ్లకుపైగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని.. వాటిని వచ్చేనెల చివరి నాటికి పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కొత్తగా మంజూరైన 343 పక్కాగృహాల నిర్మాణాలను రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో మెటీరియల్ అందించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకరావాలన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై సిమెంటు తీసుకుని నిర్మాణాలు ఆగి ఉంటే అలాంటి లబ్ధిదారులకు కొత్తగా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై ఆగిపోయినట్లయితే లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అలాంటి వారిని వెంటనే గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కాగృహం మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎక్కడ ఇళ్లు లేనివారు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు మంజూరు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలపై అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, హౌసింగ్ డీఈ బాలగంగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. అలాగే సొంత స్థలం ఉండి నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు అందేలా చూస్తామన్నారు. గృహాలు వేగవంతమయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్, మాధవకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పేదలంటే చిన్నచూపు

– వైఎస్సార్‌సీపీ నాయకులు




మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పేదలంటే చంద్రబాబుకు అంత చిన్నచూపు ఎందుకని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిన్న ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న చంద్రబాబు వైజాగ్‌లో జరిగిన బహిరంగసభకు స్పందన లేదనే చిరాకుతో పేదలపై తనకున్న అక్కసు వెళ్లగక్కారన్నారు. పేద ప్రజల అభివృద్ధే పరామావధిగా అమరావతిలో పేదలకు స్థలాలు ఇస్తుంటే దాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు పిచ్చి ప్రేలాపనలు చేయడం తగదన్నారు. నీ హయాంలో టిడ్కో ఇళ్లు పేరిట నువ్వు ఇచ్చిన ఇళ్లు 300, 355, 430 చదరపు అడుగుల కంటే ఎక్కువ లేదని.. మరి నువ్వు ఇచ్చిన దానికంటే ఎక్కువ స్థలం ఇస్తే సమాధి కట్టుకోవడానికి అని అవహేళనగా మాట్లాడటం తగదన్నారు. అమరావతి నీ కమ్మరావతిగా మార్చడానికి నీవు ప్రయత్నం చేస్తే మా నాయకుడు రాజధాని ప్రాంతం ఏ ఒక్కరి సొత్తు కాదు.. అది ప్రజలందరికీ చెందాలని పేద ప్రజలను గుర్తించి 52 వేల మందికి స్థలాలు ఇస్తుంటే దాన్ని కూడా విమర్శించడం నీతిమాలిన చర్య అన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపు ణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపా యి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపు ణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యా ధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వల్లి

కమలాపురం : ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రతి వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీఎం అండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వల్లి తెలిపారు. శుక్రవారం పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలోని జి.అప్పాయపల్లెలో జరుగుతున్న ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే వారికి అందిస్తున్న సేవలను యాప్‌లో నమోదు చేసే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందన్నారు. సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. 35 ఏళ్లు పైబడిన ప్రజలందరికి బీపీ, షుగర్, హైపర్ టెన్షన్ తదితర పరీక్షలు చేసి రోగాలున్న వారిని గుర్తించాలన్నారు. వారికి క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. అలాగే పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీని పరిశీలించి ఓపీ పెంచాలని సిబ్బందికి సూచించారు. మెడికల్ ఆఫీసర్లు ప్రసూన, నందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

22న గండిలో కొబ్బరి చిప్పలు, టోల్ గేట్ల టెండర్లు

చక్రాయపేట : ఈనెల 22న గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో కొబ్బరి చిప్పలు, టోల్‌గేట్లు, పూలవిక్రయ హక్కు నిమిత్తం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. గండిలో భక్తులు సమర్పించే కొబ్బరి కాయల్లో ఒక భాగము చిప్పను సేకరించుకునే హక్కు నిమిత్తం టెండరు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలోకి వచ్చే వాహనాల నుంచి టోల్‌గేట్లు వసూలు చేసుకునేందుకు, పూలు విక్రయించుకునేందుకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. యేడాది కాలం పాటు వీటిపై హక్కు ఉంటుంది. టెండరులో పాల్గొనే వారు రూ.5 లక్షలు దరావత్తు చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు టెండర్లలో పాల్గొనాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

మద్యం అక్రమ దుకాణాలపై దాడులు



పట్టణంలో దాడులు చేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో ధుమపానం, మద్యపానం అమ్మకాలపై మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తో కలసి అక్రమ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. బహిరంగ ప్రదేశాలలో ధుమపానం, మద్యపానం పూర్తిగా నిషేధం ఉందని వాటిని అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పొగాకు నియంత్రణ కౌన్సిలర్ సుమలతతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీ కృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, డాక్టర్ నాగరాజులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గుండె సంబంధిత ప్రజలకు కిమ్స్ ఆసుపత్రి డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు నిర్వహించి ఇసీజీ, 2డీ ఏకో, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వైఎస్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ బలిజ సంఘ కార్యాలయంలో ఈ ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయడంవల్ల ఎంతో మందికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కడియాల లక్ష్మినారాయణ, విజయ్, హరి, బాబు, రవి, ఆంజనేయులు, సురేష్, జడ్డి శ్రీనివాసులు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కిమ్స్ ఆసుపత్రి మేనేజర్ రామాంజి, కో ఆర్డినేటర్ పవన్, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలి



థెరిసానగర్‌లో లార్వా సర్వేలో భాగంగా పరిశీలన చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్‌వలి

వల్లూరు : ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడేను పాటించడం వలన లార్వాలను ప్రాథమిక దశలోనే నివారించి వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని థెరిసానగర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న ఇంటింటి లార్వాల సర్వేను ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికులతో సమస్యలను గురించి ఆరా తీశారు. ఏఎన్ఎమ్‌లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు యాప్‌లలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ఫణీంద్ర, ఎమ్‌పీహెచ్‌ఈవో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతకొమ్మదిన్నె : పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. శుక్రవారం సీకేదిన్నె గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీనివాసులురెడ్డి. గోపాలకృష్ణయ్య, చిన్నసిద్దయ్య, రమణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ప్రజల మనిషిగా గుర్తించుకున్న నాయకుడు కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు శివనారాయణ అన్నారు. శుక్రవారం సుందరయ్య 38వ వర్థంతి సందర్భంగా పాతబస్టాండ్‌లోని ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పరాకాష్టకు చేరిన పచ్చమీడియా వ్యవహారం

ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం : పచ్చమీడియా వ్యవహారం పరాకాష్టకు చేరిందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం సింహాద్రిపురంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పి చెప్పి నిజం చేయడానికి పచ్చ మీడియా చూస్తోందన్నారు. దీన్ని ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు పదే పదే చూపుతూ బురదజల్లే కార్యక్రమానికి తెరలేపిందన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి న్యాయ వ్యవస్థ మీద పూర్తి నమ్మకంతో సీబీఐ విచారణకు వారు పిలిచినప్పుడల్లా వెళుతూనే ఉన్నారన్నారు. 7వ సారి కూడా విచారణకు వెళ్లాలని హైదరాబాద్‌కు వెళ్లారు.. అయితే తల్లి ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చేరిందని సీబీఐ వారికి చెప్పి వస్తుంటే పచ్చ మీడియా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పారిపోయారని.. నిజాన్ని కప్పిపుచ్చి అబద్దాన్ని పదే పదే చూపించడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. కేవలం అవినాష్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేయాలని పచ్చ మీడియా నిజాన్ని దాచిపెట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, జాఫర్, శంకర్‌రెడ్డి, బషీర్, ఖాదర్‌వలి, మహ్మద్, సురేష్, ప్రహ్లాదారెడ్డి, కృష్ణారెడ్డి, సి.వెంకటనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

ఎంపీపై ఎల్లో మీడియా అసత్యప్రచారం

జమ్మలమడుగు : పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డిపై ఎల్లో మిడియా పనికట్టుకుని అసత్యప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వి.హృషికేశవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. వైఎస్ అవినాష్‌రెడ్డి తన తల్లి అనారోగ్యానికి గురి కావడంతో వెంటనే ఆయన సీబీఐకి సమాచారం ఇచ్చి నేరుగా పులివెందులకు వచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఎల్లో మిడియా భయపడిపోయి సీబీఐ విచారణకు హాజరు కాలేదంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

పిల్లల్లో సృజనాత్మకతను పెంచాలి



సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సూపర్‌వైజరు హైమావతి

చక్రాయపేట : చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచడానికే సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హైమావతి, లక్ష్మీదేవిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో స్థానిక సర్పంచ్ మేకల లక్షుమయ్య ఆధ్వర్యంలో సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక మానసిక అభివృద్ధి, బుద్ధి వికాసం తదితర అంశాలపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ సూపర్ ట్రైనర్ స్వరూపరాణి అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లల్లో దాగి వున్న నైపుణ్యాలను గుర్తించాలి

వల్లూరు : పిల్లల్లో దాగి వున్న నైపుణ్యాలను గుర్తించి మరింతగా పెంచడానికి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని వల్లూరు శాఖా గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పలువురు పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు క్యారమ్స్, లూడో, చెస్ మొదలైన ఆటలను నేర్పించి వారి చేత ఆడించారు.

కమలాపురంలో..

కమలాపురం : విజ్ఞానం, ఆలోచనలు పెంపొందించే క్రీడలు ఆడాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా శుక్రవారం విజ్ఞానం, ఆలోచనలు పెంపొందించే చెస్, క్యారమ్స్ తదితర ఆటల్లో ఆమె విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. క్రీడల్లో రాణిస్తే విద్యలో రాణించడం చాలా సులభం అని ఆమె విద్యార్థులకు సూచించారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

ముద్దనూరు : పురుగుమందుల దుకాణాల్లో వ్యాపారులు నాణ్యమైన, అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థాని క ఏఓ కార్యాలయంలో మండలంలోని డీలర్లతో ఆ యన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనుమతి పొందిన, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను విక్ర యించాలని, అను మతిలేని వాటిని అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముద్దనూరు : విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం నుంచి అంతరాయం కలుగుతుందని ఏఈ రాజావర్మ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నేటి ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదని ఆయన తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం వుంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వార్డులలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్



యూజీడీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్టియన్‌లైన్, బలిజ సంఘం వీధి తదితర ప్రాంతాలలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న యూజీడీ పనులను పరిశీలించి మాట్లాడారు. మహిళలు వారి వ్యర్థ దుస్తులను యూజీడీ చాంబర్లలో వేయడంవల్ల అవి పైపులకు అడ్డుపడి మురుగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. కావున మహిళలు దయచేసి వ్యర్థ దుస్తులే కాకుండా ఎటువంటి వ్యర్థాలను యూజీడీ చాంబర్లలో వేయకుండా పురపాలక చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. అనంతరం జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులు పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల నాణ్యతను సచివాలయ అమెనిటీ సెక్రటరీలు నిత్యం పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



కమలాపురంలో మజ్జిగను అందిస్తున్న కమిషనర్ రాజశేఖర్



సింహాద్రిపురంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ రోషన్

కమలాపురం : మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న చిరుద్యోగి శీలం శ్రీనివాసులు స్థాపించిన 'మన ఊరు సేవా సమితి' చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయం అని కమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం కడప–తాడిపత్రి ప్రధాన రహదారి క్రాస్‌రోడ్డు సమీపంలోని చలివేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. గత 11 ఏళ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి వారంలో కనీసం రెండు రోజులైనా మజ్జిగ పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకుని మరిన్ని మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : డీఎస్పీ వినోద్‌కుమార్, రూరల్ సీఐ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో సింహాద్రిపురం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ రోషన్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మల్లారెడ్డి, గురుమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహక బహుమతికి లావణ్య ఎంపిక



తల్లిదండ్రులు, అన్నతో వేమా లావణ్య

చక్రాయపేట : పది ఫలితాల్లో నియోజకవర్గంలోనే టాపర్‌గా నిలిచిన నాగేలి వేమా లావణ్య ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. లావణ్య 585 మార్కులు సాధించి జిల్లాలో సెకండ్‌గా నలిచింది. మున్సిపల్ హైస్కూల్‌ను మినహాయించి జడ్పీ హైస్కూల్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే జిల్లా టాపర్ గానే నిలుస్తుంది. చక్రాయపేట మండలంలోని సురభి గ్రామం పాయలోపల్లెకు చెందిన లావణ్యది వ్యవసాయ కుటుంబం. తండ్రి జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటే తల్లి పొలం పనులు చూసుకుంటూ బిడ్డలను చదివించుకుంటూ వస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం అమలులోకి తేవడంతో పాటు అమ్మవడితో ఆర్థికంగా అండగా నిలబడటంతో 8వ తరగతిలో నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్‌లో చేరింది. ఈమె అన్న కూడా గత విద్యాసంవత్సరం నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్ లోనే 10వ తరగతిలో 560 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ప్రస్తుతం ఇడుపులపాయలో ట్రిపుల్‌ఐటీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లావణ్య టాపర్‌గా నిలవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్ ఉపాధ్యాయులు లాణ్యను అభినందించారు.

క్రికెట్ టోర్నీ విజేత నల్లపురెడ్డిపల్లె జట్టు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో నల్లపురెడ్డిపల్లె క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డీఆర్డీఏ ఏపీఎం ఆంజనేయులు హాజరై విజేత జట్టుకు బహుమతులను ప్రదానం చేశారు. ఈనెల 9వ తేదీ నుంచి జరిగిన ఈ క్రికెట్ టోర్నీలో మొత్తం 18 జట్లు పాల్గొనగా.. ఎర్రబల్లె, నల్లపురెడ్డిపల్లె క్రికెట్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో నల్లపురెడ్డిపల్లె జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం ఏపీఎం విజేత జట్టుకు రూ.10,116ల నగదుతోపాటు కప్పు, మెమెంటోలను అందించారు. రన్నర్ జట్టుకు రూ.5,116ల నగదుతోపాటు, కప్పు, మెమెంటోలను అందించారు. ఈ టోర్నీలో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కూడా ప్రత్యేక బహుమతులను అందించారు.

కార్యక్రమంలో క్రికెట్ టోర్నీ నిర్వాహకులు ప్రసాద్, శేఖర్, అరవింద్‌రెడ్డి, లోకేష్ యాదవ్, నరేష్ యాదవ్, గ్రామస్తులు, క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.